ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024

వైద్యులకు రక్షణ లేదా?



- స్విమ్స్‌లో జూడాల వినూత్న నిరసన
- కోల్‌కతా డాక్టర్ హత్యపై నాటక ప్రదర్శన

రుయాస్పత్రి వద్దా నిరసన

కోల్‌కతాలో జరిగిన హత్యను వ్యతిరేకిస్తూ ఎస్వీ వైద్య కళాశాలలోని జూనియర్, పీజీ డాక్టర్లు రుయాస్పత్రిలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.వీరికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మద్దతుగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ- విధుల్లోని జూనియర్ డాక్టరుపై ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు.పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను తేవాలని డిమాండ్ చేశారు.హత్యపై పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.

తిరుపతి (వైద్యం), ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాలలో జరిగిన జూనియర్ మహిళా డాక్టరు హత్యను నిరసిస్తూ స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) శుక్రవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ర్యాలీ చేశాక స్విమ్స్ సర్కిల్ వద్ద హత్యను వివరిస్తూ నాటక ప్రదర్శన నిర్వహించారు. మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శను స్విమ్స్‌కు వచ్చే రోగులతో పాటు పరిసర ప్రాంతాల్లోనివారు ఆసక్తిగా తిల కిం చారు. విధుల్లో ఉండే డాక్టర్లకు రక్షణ లేకుండా పోతుందని, మహిళా డాక్టర్లకు అయితే కనీస రక్షణ చర్యలు కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు, చట్టాలు అమలు చేయాలని, అపుడే పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఆర్డీఎస్‌పే వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్విమ్స్ వద్ద జూనియర్ డాక్టర్ల నాటక ప్రదర్శన

కళంకిత కార్పొరేటర్లు అవసరమా?

- టీడీపీలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల తహతహ
- వారంతా భూమన షాడోలంటున్న స్థానిక నాయకులు
- తర్వాత చూస్తామని తిప్పిపంపిన పార్టీ అధిష్ఠానం



మంత్రి రాంప్రసాద రెడ్డితో అన్నా రామచంద్ర, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్లలో అరాచకశక్తులుగా మారి ప్రజలను ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిన కొందరు వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. పార్టీ కండువా కప్పేసుకుంటామని కూటమి నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి తలపడ్డవారి బతుకు మీద కొట్టడమే కాక చేయాల్సిన అరాచకాలన్నీ చేసేసి అవేమీ గుర్తు లేనట్టుగా జంపింగ్‌కు సిద్ధపడుతున్న వారికి కొందరు కూటమి నేతలు రెడ్‌కార్పెట్ పరుస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ అధికారంలో ఉండగా ఎలాంటి పదవీ లేకపోయినా ముఖ్యనేతకు దగ్గరగా మెలిగిన ఓ కీలక నేత టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.అప్పట్లో ఎలాంటి సెటిల్‌మెంటైనా అతడి కార్యాలయంలోనే జరిగేది. తన ఇంటిలో ఓ కార్పొరేటర్ ఉండగా, సమీప బంధువు మరొకరు,అనుచరులైన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు కార్పొరేటర్లను కూటమిలోకి తీసుకొస్తానంటున్న ఆయన డిప్యూటీ మేయర్ పదవి తన కుటుంబానికే ఇవ్వాలని డిమాండు చేస్తున్నట్లు సమాచారం.43వ డివిజన్లో పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థికి చెందిన టీ దుకాణాన్ని అధికార బలంతో ధ్వంసం చేశారు.45వ డివిజన్ పరిధిలో టీ దుకాణం నడుపుతున్న ఓ టీడీపీ కార్యకర్తపై దాడి చేసి గాయపరిచారు. ఎన్నికల ముందు 'జగన్ రెడ్డి మరో 30 ఏళ్లు సీఎంగా ఉంటారు. మా పార్టీలోకి వచ్చేయండి' అని భయపెట్టిన వైసీపీ నేతలు కూడా ఇప్పుడు కూటమిలోకి వచ్చేందుకు పరితపిస్తున్నారు.మూడున్నరేళ్లుగా అధికారబలంతో టిఫిన్ బండి నుంచి కూడా మామూళ్లు వసూలు చేసుకోవడానికి అలవాటు పడ్డ ఇంకొందరు కార్పొరేటర్లు కూడా పార్టీ మారేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.డివిజన్లో ఇల్లు కట్టుకునేందుకు ఎవరైనా ఇటుకలు తోలుకుంటే కూడా డబ్బులు డిమాండు చేసిన కార్పొరేటర్లు ఇప్పుడు కూటమిలోకి రావడం వలన ఎవరికి ప్రయోజనమో పార్టీ అధిష్ఠానాలు బాగా ఆలోచించాల్సివుంది.

మేయర్ రాకపోతే వీరొచ్చినా ఉపయోగంలేదు

50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. అంటే మేయర్ బెర్త్‌ను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరారు. ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. అయితే నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు మేయర్‌పై అవిశ్వాసం పెట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ చట్టాన్ని సవరించింది. దీంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ కాలవ్యవధిని కుదిస్తూ చట్ట సవరణ మళ్లీ చేస్తే తప్ప కొత్త మేయర్ ఎన్నిక జరగదు. నాలుగేళ్లు పూర్తయ్యేందుకు ఇంకా ఆరు నెలల సమయముంది. పార్టీ మారేందుకు సందిగ్ధంలో ఉన్న మేయర్ డాక్టర్ శిరీష వైసీపీలోనే కొనసాగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. అందువల్ల ఇప్పటికిప్పుడు మెజారిటీ కార్పొరేటర్లు కూటమి వైపు వచ్చినా కూటమి ఖాతాలోకి మేయర్ పీఠం చేరదు.

ఇందుకేనా వచ్చేది?

వైసీపీ స్థానిక నాయకత్వం అనుమతితోనే కొందరు కార్పొరేటర్లు కూటమిలోకి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలో ఉంటే అన్ని విధాలా ప్రయోజనాలు పొందవచ్చని, ఇక్కడి రహస్యాలను చేరవేసేందుకు కూడా అవకాశం ఉంటుందన్న రాజకీయ కోణంతో వైసీపీ నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పాటు మరో ఏడాదిన్నరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తమ కార్పొరేటర్ సీటును అధికార పార్టీనుంచి హామీ తీసుకుని పోటీ చేయాలని మరికొందరు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు.శ్రీకాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేని వెంటబెట్టుకుని శుక్రవారం ఓ పదిమంది కార్పొరేటర్లు విజయవాడ బాట పట్టారు. పార్టీ కండువాలను కప్పేసుకోవడానికి సిద్ధపడితే, ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశం తరువాత స్థానిక నాయకత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని టీడీపీ ముఖ్యనేతలు తిప్పి పంపినట్టు తెలిసింది.

వీరి గురించి సమాచారమివ్వండి

టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల గురించి ఆరా తీసేందుకు పార్టీ అధిష్ఠానం సిద్ధమైంది. ఆదం సుధాకర రెడ్డి కుమార్తె ఆదం లీల (9వ డివిజన్ కార్పొరేటర్), దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి(10వ డివిజన్), దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి భార్య ప్రవల్లికా రెడ్డి(11), మహేష్ రెడ్డి భార్య షాలిని రెడ్డి (15), వెంకటముని రెడ్డి తల్లి రాజమ్మ (20), డిష్ చంద్ర భార్య సునీత (22), పొన్నాల చంద్ర (28), దూది శివ భార్య కుమారి (33), మునిరామి రెడ్డి భార్య శ్రావణి (34), కుడితి సుబ్రమణ్యం (36), బాలసుబ్రమణ్యం భార్య గీత (37), నరేంద్ర నాథ్(38), మురళీ యాదవ్ భార్య రాధ (43), పెంచలయ్య భార్య రాణి (46), అనిల్ (50), ఈశ్వరి (21), అనీష్ రాయల్ (45)తో పాటు ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన అన్నా రామచంద్రయ్య కుమార్తెలు అన్నా సంధ్య (48), అన్నా అనిత (49వ డివిజన్ కార్పొరేటర్)ల గురించి పూర్తి సమాచారం కావాలని స్థానిక నాయకత్వాన్ని టీడీపీ కోరినట్టు సమాచారం.

వాళ్లను తీసుకోవద్దు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

ఐదేళ్లుగా తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకోవద్దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును స్థానిక టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడికి వైసీపీ కార్పొరేటర్ల ఆగడాల గురించి వివరించారు. స్థానిక నాయకత్వానికి ఎలాంటి సమాచారం లేకుండా పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివలన పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లి ఆ పార్టీలో కూడా చేర్చుకోనివ్వకుండా చూడాలని కోరారు. పల్లా శ్రీనివాసరావును కలిసినవారిలో 43వ డివిజన్ ఇంచార్జి ఆర్సీ శ్రీనివాసులు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మునిశేఖర్ రాయల్, బాలసుబ్రమణ్యం రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.



టీడీపీలో చేరేందుకు విజయవాడ వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, నేతలు

జయహో

షార్‌లో సంబరాల హోరు



అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరోసారి మెరిసింది. ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ విజయంతో మరో చారిత్రాత్మక మైలురాయిని దాటింది. చిన్న ఉపగ్రహ వాహక నౌక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఈవోఎస్-08 ఉపగ్రహంతో పాటు మరో రెండు బుల్లి ఉపగ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలో ప్రవేశపెట్టడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని తిలకిస్తున్న శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది శాస్త్రవేత్తలు దేశానికి ఇచ్చిన కానుకగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభివర్ణించారు.రాకెట్ విజయానికి అహర్నిశలూ పనిచేసిన శాస్త్రవేత్తలను అభినందించారు.



రాకెట్ మొదటి దశ



రెండవ దశ



మూడవ దశ



నాల్గవ దశలో విడిపోతున్న ఉపగ్రహం

దశల వారీగా రాకెట్ విడిపోయింది ఇలా..

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ అన్ని దశలనూ సునాయాసంగా పూర్తి చేసుకొని 17 నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. 34 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, 119 టన్నుల బరువు గల రాకెట్ తన మొదటి దశలో 87 టన్నుల ఘన ఇంధనంతో భూమి నుంచి నింగిలోకి పయనమై 124 సెకన్లకు 93 కి.మీ ఎత్తులో తొలి దశ పూర్తి చేసుకొంది. 7.7 టన్నుల ఘన ఇంధనంతో 125 సెకన్లకు ప్రారంభమైన రెండో దశ 420 సెకన్లకు 450 కి.మీ ఎత్తులోకి వెళ్లి పూర్తి చేసింది. అనంతరం మూడవదశ ప్రారంభమై 4.5 టన్నుల ఘన ఇంధనంతో వేగంగా 697 సెకన్లకు 475 కిలోమీటర్ల ఎత్తుకు చేరింది. అనంతరం 0.05 టన్నుల ద్రవ ఇంధనంతో నాలుగో దశ ప్రారంభమై రాకెట్‌లో ఉన్న ఈవోఎస్-08 ఉపగ్రహం 808 సెకన్లకు కక్ష్యలోకి విడిపోయింది. అనంతరం 994 సెకన్లకు ఎస్ఆర్-0, డెమోశాట్ ఉపగ్రహాలు కూడా ఒకదాని తరువాత రోదసీలోకి ప్రవేశపెట్టారు. సంవత్సరం పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది.

- సూళ్లూరుపేట

ఇద్దరు ఏఎస్పీల బదిలీ

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచీ ఇద్దరు అదనపు ఎస్పీలు, ఒక నాన్ క్యాడర్ ఎస్పీ బదిలీ అయ్యారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ జె.కులశేఖర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, క్రైమ్ విభాగ ఏఎస్పీ బీహెచ్ విమలకుమారి ఏసీబీకి బదిలీ అయ్యారు.కులశేఖర్ స్థానంలో బి.నాగభూషణరావు నియమితులయ్యారు. ఆయన ఏసీబీలో పనిచేస్తూ సెబ్‌కు అటాచ్ చేయడంతో ఆ విభాగంలో ప్రస్తుతం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాలో పనిచేస్తున్నారు. తిరుపతి కేంద్రంగా నడుస్తున్న రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌లో నాన్ క్యాడర్ ఎస్పీగా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు ఏపీ పోలీస్ అకాడమీకి బదిలీ అయ్యారు.

19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు రాక

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీసిటీకి ఈనెల 19వ తేదీన రానున్నారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు చంద్రబాబు ఈనెల 19న తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీసిటీ వెళతారు. అక్కడ ఎనిమిది పరిశ్రమలకు భూమి పూజ చేయడంతో పాటు మరో 16 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. అలాగే ఐదు పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో భూమిపూజ, ప్రారంభోత్సవాల తర్వాత ఫాక్స్‌కాన్ పరిశ్రమల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం వివిధ పరిశ్రమల సీఈవోలతో సమావేశం నిర్వహించనున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులతో కలసి శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. హెలిపాడ్‌ను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

పసిడి చీరలో పద్మావతమ్మ

- తిరుచానూరులో ఘనంగా వరలక్ష్మి వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 16 : తిరుచానూరులో కొలువైన పద్మావతీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కనులపండువగా వరలక్ష్మి వ్రతం జరిగింది.అమ్మవారి ఉత్సవమూర్తిని బంగారు చీరలో ఆస్థాన మండపంలోని పద్మపీఠంపై కొలువుదీర్చారు.సంప్రదాయ పుష్పాలతో ఆరాధించి అమ్మవారిని 9 గ్రంథులతో అలంకరించారు.12రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన వరలక్ష్మి వ్రతం మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళహారతితో ముగిసింది.సాయంత్రం మహాలక్ష్మి అలంకరణలో స్వర్ణరథంపై కొలువుదీరిన పద్మావతీ దేవి మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించింది.టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం ఆకట్టుకుంది.20వేల కట్ ఫ్లవర్స్‌తో మూడు రోజుల పాటు 15మంది సిబ్బంది శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం,వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు.పద్మావతీ దేవిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.సర్వదర్శనానికి గంటన్నరకుపైగా పట్టింది.ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు,జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతీ దేవి

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

● శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. కాలినడక మార్గాలతోపాటు ఘాట్‌రోడ్లు, అలిపిరి చెక్ పాయింట్ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో శుక్రవారం సాయంత్రం సమయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లతోపాటు నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది.

అలిపిరిలో భారీగా నిలిచి ఉన్న వాహనాలు



ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలపై పనిభారం తగ్గించాలి: సీఐటీయూ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 16: రుయాస్పత్రిలో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలంటూ శుక్రవారం ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. గతంలో 500 పడకలు ఉన్నప్పుడు ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలతోపాటు బార్బర్లు, తోటీలు కలిపి 250 మంది వరకు ఉండేవారన్నారు. ఇప్పుడు 1,268 పడకలుగా ఆస్పత్రి విస్తరిస్తే కేవలం 85 మంది ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలతోనే పని చేయించడం దురదృష్టకరమన్నారు.

దొంగతనం కేసులో 13నెలల జైలు

తిరుపతి(లీగల్), ఆగస్టు 16: ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన కేసులో గుంటూరుజిల్లా తెనాలికి చెందిన బసవరాజు శ్రీనివాస్ అలియాస్ కపిల్ అలియాస్ శీనుకు 13నెలల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఒకటో అదనపు మున్సిఫ్‌కోర్టు జడ్జి సత్యకాంత్‌కుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. 2023 డిసెంబర్ ఏడో తేదీన రేణిగుంట మండలం గాజుల మండ్యం దాశమ్మనగర్‌లోని ఓ ఇంట్లో చొరబడి బీరువాను పగులగొట్టి బంగారు నగలను దోచుకెళ్లాడు. బాధితురాలు ఎస్.బుజ్జమ్మ ఫిర్యాదుతో రేణిగుంట పోలీసులు నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచారు. నేరం నిరూపణ కావడంతో నిందితుడికి శిక్ష ఖరారు చేశారు.

రేపు, ఎల్లుండి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 16: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలనుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలవరకు దాదాపు 200ట్రిప్పులు తిరగనున్నాయి. రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చిన ప్రయాణికులకు ఏసీ, నాన్‌ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. రాకపోకలకు రిజర్వేషన్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు.

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్య పరిష్కరించండి: సీఐటీయూ

మంగళం, ఆగస్టు 16: శ్రీవారి మెట్టు వద్ద చిరు వ్యాపారుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. లేదంటే ఈనెల 21వ తేదీన టీటీడీ పరిపాలన భవనం ముందు వ్యాపారులతో కలిసి నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అలిపిరి మార్గంలో చిరుత పులి దాడి చేస్తే.. శ్రీవారి మెట్టు వద్ద వ్యాపారులను తరిమేయడం సరికాదన్నారు.

నేడు పాయిదరువులు నవల ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16: ప్రముఖ కథా రచయిత కేవీ మేఘనాథ్ రెడ్డి రచించిన నవల పాయిదరువులు ఆవిష్కరణ సభ శనివారం జరగనుంది. ఉదయం పది గంటలకు బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సభ నిర్వహించనున్నారు.అనంతరం శివేగారి దేవమ్మ కథా పురస్కారం(2023), బాపురం గురురాజారావు కవితా పురస్కారం (2020) ప్రదానోత్సవం ఉంటుంది. కేపీ మునిసురేష్ పిళ్లై, కూచిమంచి నాగేంద్ర, గూండ్ల వెంకటనారాయణ, ఆర్సీ కృష్ణస్వామి రాజులకు ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంబాబు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 16: ఎస్వీయూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఏటుకూరి రాంబాబు నాయుడు నియమితులయ్యారు. యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రమణయ్య, రవిబాబు, ప్రధాన కార్యదర్శిగా అంజన్‌సింగ్, కోశాధికారిగా శరత్‌బాబుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుడికి అవార్డు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 16: ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ఫిజిక్స్ అధ్యాపకుడు చంద్రశేఖర్ అవార్డు పొందారు. ఫిజిక్స్ బోధన, పరిశోధనలో ఆయన కృషికి గుర్తింపుగా ఢిల్లీకి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, అధ్యాపకులు భీమన్న, సుబ్రమణ్యం, కామేశ్వరరావు, మధుసూదన్, సురేష్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ చైర్మన్ పదవి బలిజలకు కేటాయించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 16: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని బలిజలకు కేటాయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన్ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

పెండింగ్ జీతాలివ్వండి: ఏఐటీయూసీ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 16: పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వకుండా, మూడేళ్లుగా పీఎఫ్ జమ చేయకుండా ఏజెన్సీ నిర్వాహకులు వారి శ్రమను దోచుకుంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మండిపడ్డారు.వెంటనే పెండింగ్‌లోని జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు కార్మికులతో కలిసి శుక్రవారం రుయాస్పత్రి, ప్రసూతి ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాలల ముందు నిరసన తెలిపారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో స్కిల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 16: తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రారంభించనున్న స్కిల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీ నుంచి ఆరు రకాల స్కిల్ కోర్సులను ప్రారంభిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. డిప్లొమా, ఐటీఐ, ఇంటర్మీడియట్ చదివినవారు తమ ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకునేందుకు ఈ కోర్సులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒక్కో కోర్సుకు 90 గంటల శిక్షణ ఉంటుందని, రూ.1,500 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు ఓ పరీక్ష నిర్వహిస్తారని, ఉత్తీర్ణులైన వారికి విజయవాడలోని ఎస్‌బీటీఈటీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. మరింత సమాచారం కోసం ఐఆర్‌జీ ల్యాబ్ ఇన్‌చార్జి కమల్‌ను (సెల్ నెంబరు-99851 29995) సంప్రదించాలని సూచించారు.

కోర్సులివే..

ఎలక్ట్రికల్ కాడ్, ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్ (పీఎల్‌సీ), సాలిడ్ ఎడ్జ్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రోగ్రామింగ్ (సీఎన్‌సీ), రెవిట్ ఆర్కిటెక్చర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ).

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, బొజ్జల సుధీర్‌రెడ్డి, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, ఎస్పీఎఫ్ డీఐజీ త్రివిక్రమ్ వర్మ, ఐఏఎస్ అధికారి విశాల్ గున్ని, టీడీపీ నేత రవినాయుడు దర్శించుకున్నారు.

శ్రీవారి పాదాల వద్ద వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల నారాయణగిరి శ్రీవారిపాదాల వద్ద శుక్రవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారిపాదాల వద్ద టీటీడీ అర్చకబృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు.భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

చౌక దుకాణాల్లో తూనికల తనిఖీ



ఎర్రావారిపాలెం, ఆగస్టు 16: మండలంలోని రేషన్ దుకాణల్లో తూనికలను తహసీల్దార్ పరమేశ్వర స్వామి తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం నెరబైలు రేషన్‌షాప్‌కు సిబ్బందితో కలిసి వెళ్లి లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న బియ్యం, చక్కెర తూనికలను పరిశీలించారు.అనంతరం నెరబైలు పశువైద్య ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఆర్ఐ జానకీ రామయ్య, సర్వేయర్ సురేష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

శ్రీవారికి కొప్పెర కానుక



కొప్పెర గంగాళంతో కొప్పెర వంశస్థులు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర గంగాళాన్ని కొప్పెర వంశస్థులు అందజేశారు. తిరుపతికి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర వంశస్థులు సాయిసురేష్ తన సోదరులు కుమార్, కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం కొప్పెర(హుండీ గంగాళం)తో ఆలయం చేరుకున్నారు. తనిఖీల అనంతరం ఆలయంలోకి తీసుకువెళ్లి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. సాయిసురేష్ మాట్లాడుతూ.. తాము 200 ఏళ్లుగా వంశపారపర్యంగా శ్రీవారికి కొప్పెర అందజేస్తున్నామని, రాగి, ఇత్తడి ఇతర లోహాలతో తయారు చేసిన ఈ గంగాళం బరువు 75 కేజీలు ఉంటుందని, తయారీకి దాదాపు రూ.2 లక్షలు అయ్యిందని తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మికి తిరుమంజనం



రామచంద్రాపురం, ఆగస్టు 16: వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారికి శాస్త్రోక్తంగా తిరుమంజనం జరిగింది.కలశ ప్రతిష్ఠ చేసి వరలక్ష్మి వ్రతం నోములు నోచారు.

ఆకట్టుకున్న పాండవ జననం

రామచంద్రాపురం, ఆగస్టు 16: ఎన్ఆర్ కమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి సీతాలక్ష్మి వినిపించిన పాండవ జననం సభికులను ఆకట్టుకుంది.సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగించారు.

తిరుమల పూర్వవైభవం సంతరించుకోవాలి

- తెలంగాణ ఎంపీ లక్ష్మణ్ -

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): భక్తులతో కిటకిటలాడే తిరుమల పూర్వవైభవం సంతరించుకోవాలని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ హిందుత్వ పవిత్రతను కాపాడేలా ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని తెలంగాణ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడాలనే ఇప్పటికే సీఎంకు బహిరంగ లేఖ రాశానన్నారు. భక్తుల కానుకలతో కేవలం హిందూ ధర్మపరచారం కోసం, ఆలయాల నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

విజయవాడ పోలీసులకు ప్రేమజంట అప్పగింత



తిరుచానూరు, ఆగస్టు 16: విజయవాడకు చెందిన సాంబశివరావు, అలేఖ్యచౌదరి 11ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. దీంతో గురువారం తిరుపతికి వచ్చి ఓ ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే అలేఖ్య తల్లిదండ్రులు విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసి అలేఖ్య, సాంబశివరావు శుక్రవారం తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. పోలీసు రక్షణలోనే విజయవాడకు పంపించాలని సీఐ సునీల్‌కుమార్‌ను కోరారు. విషయం తెలుసుకుని గురువారం రాత్రి అలేఖ్య తల్లిదండ్రులు, భవానీపురం పోలీసులు తిరుచానూరు చేరుకున్నారు. వారిద్దరూ మేజర్లు అని, వారిని ఇబ్బంది పెట్టవద్దని ఏదైనా ఉంటే అక్కడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ప్రేమజంటను భవానీపురం పోలీసులకు అప్పగించారు.

తిరుపతి రూరల్ తహసీల్దారుగా రామాంజులనాయక్

తిరుచానూరు,ఆగస్టు16: చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దారు రామాంజులనాయక్‌ను తిరుపతి రూరల్ తహసీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న మహబూబ్ చాంద్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి



తిరుచానూరు, ఆగస్టు 16: శిల్పారామం సమీపంలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న వాసు(60) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.పూతలపట్టు మండలం ఎం.బండపల్లికి చెందిన వాసు గురువారం రోడ్డు దాటుతుండగా ఓ ఆటో వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌తో ఆరణి భేటీ



తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం భేటీ అయ్యారు. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హామీల పరిష్కారంపై సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో బోర్ల మరమ్మతు

తిరుపతి రూరల్, ఆగస్టు16: తిరుపతి రూరల్ మండలం తనపల్లె పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో మరమ్మతులకు గురైన మూడు బోర్లను శుక్రవారం రీబోర్ చేసి ప్రజలకు తాగునీరు సౌకర్యం కల్పించారు. 7బోర్లు మరమ్మతులకు గురైనా గత వైసీపీ పాలకులు పట్టించుకోకుండా అలాగే వదిలేశారని కాలనీప్రజలంటున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా గ్రామ టీడీపీ కమిటీ అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి నేతృత్వంలో శుక్రవారం మూడుబోర్లను రీబోర్ చేయడంతోపాటు విద్యుత్ మోటార్లను అమర్చి తాగునీరందించే ఏర్పాట్లు చేశారు.

2వేలమందితో ప్రారంభించిన అన్నదానం లక్షకు ఎదిగింది

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):స్వర్గీయ నందమూరి తారక రామారావు తిరుమలలో రోజుకు 2వేల మందితో 1985లో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం నేడు లక్షమందికి భోజన వసతి కల్పించే కార్యక్రమంగా ఎదిగిందని, దీనికి సహకరించిన భక్తులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమలలోని వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో రిజిస్టర్‌లో రాశారు.శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాద భవనంలో భోంచేశారు. అనంతరం భక్తులు తమ అభిప్రాయాలు రాసేందుకు అందుబాటులో ఉంచిన రిజిస్టర్‌లో అన్నప్రసాద భవనం గురించి స్వయంగా రాశారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పవిత్రమైన మనసుతో అమలు చేస్తున్న అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. అన్నప్రసాదాలు చాలా రుచికరంగా ఉన్నాయన్నారు. శుభ్రత కూడా బాగుందని రిజిస్టర్‌లో రాశారు.

తిరుమల ఘాట్‌లో స్పీడ్ లిమిట్‌పై టీటీడీ దృష్టి

● ప్రమాదాలు నివారించేందుకు చర్యలు ● పలుచోట్ల సూచిక బోర్డుల ఏర్పాటు



రెండో ఘాట్‌లో ప్రయాణ సమయ నిబంధన తెలిపేలా ఏర్పాటు చేసిన బోర్డు

తిరుమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో వాహనాల వేగాన్ని అదుపుచేసి ప్రమాదాలను నివారించేందుకు టీటీడీ చర్యలకు పూనుకుంది. స్పీడ్ లిమిట్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టడంతోపాటు పలు ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల క్రితం వరకు వాహనాల వేగానికి ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరిగాయి. దాంతో ప్రమాదాల నివారణకు టీటీడీ దాదాపు 11 ఏళ్ల క్రితం తిరుమల మొదటి ఘాట్ (తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మార్గం), రెండో ఘాట్ (తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే మార్గం)లో సమయ నిబంధనను తెరపైకి తీసుకువచ్చింది. 2013 మే నెలలో మొదటి ఘాట్‌లోని ఓ మలుపు వద్ద జరిగిన జీపు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోవడంతోపాటు పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. అంతకుముందు కూడా చాలా ప్రమాదాలు జరిగాయి. ఈక్రమంలో వాహనాలు వేగంగా వెళుతున్నాయని, ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలంటే ఘాట్‌లో ప్రయాణానికి సమయం నిబంధనను అమలుచేయాలని అప్పట్లో అధికారులు నిర్ణయించి జూలై నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అలిపిరి చెక్‌పాయింట్ నుంచి తిరుమల జీఎన్సీ వరకు చేరుకోవాలంటే 28 నిమిషాలు, తిరుమల జీఎన్సీ నుంచి అలిపిరి చెక్‌పాయింట్ వరకు చేరుకోవడానికి 40 నిమిషాల ప్రయాణ సమయ నిబంధన పెట్టారు. ఈ సమయానికంటే ముందుకు చేరుకునే వాహనాలకు 'నాట్ అలౌడ్' పెట్టి జరిమానాలు వేసేలా చర్యలు తీసుకున్నారు.

తాజా ప్రమాదాల నేపథ్యంలో..

రెండు, మూడేళ్లుగా ప్రయాణ సమయ నిబంధనలను జీఎన్సీ వద్ద, అలిపిరిలో సక్రమంగా తనిఖీలు చేయని నేపథ్యంలో విధించిన సమయానికంటే వాహనాలు వేగంగా ప్రయాణించాయి. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్న కారణంగా సమయం నిబంధనను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదనే కారణాలను చెప్పుకొచ్చారు. దీంతో ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతూనే వచ్చింది.తాజాగా జీఎన్సీ టోల్‌గేట్‌కు సమయంలో బస్సు కిందపడి ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబంధిత అధికారులు తిరిగి సమయం నిబంధనను పటిష్ఠంగా అమలుచేస్తున్నారు. జీఎన్సీ, అలిపిరిలో ప్రతి వాహనం నుంచి టోకెన్లు తీసుకుని స్కాన్ చేసి సమయాన్ని పాటిస్తున్నారా లేదా అని పరిశీలిస్తున్నారు. ఘాట్‌లో వేగంగా వచ్చి టోల్‌గేట్ల ముందు వేచి ఉండేవారిపైనా నిఘా ఉంచారు. ఇక, ఫాస్ట్‌ట్రాక్ ద్వారా పేమెంట్ చేసిన వారికి కూడా టోకెన్లు జారీ చేయడంతోపాటు ఆర్టీసీ బస్సులకూ టోకెన్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా వీరు ఏ సమయానికి ప్రారంభమయ్యారు, ఏ సమయానికి చేరుకున్నారనే విషయం తెలిసిపోతుంది. అలాగే రెండు మార్గాల్లోనూ సమయం నిబంధనను తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాల వేగాన్ని అలిపిరి, జీఎన్సీ వద్ద తనిఖీలు చేయడం లేదు. త్వరలో వీరికి కూడా టోకెన్లు జారీ చేసి తనిఖీ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 16:ఎస్వీయూ డిగ్రీ మెగా సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదలైంది. 1990 నుంచి 2015 వరకు డిగ్రీ చదివి.. ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు సెప్టెంబరు 30వ తేదీ చివరి గడువుగా విధించారు. సమగ్ర సమాచారం కోసం సంబంధిత కాలేజీలో కానీ, యూనివర్సిటీ పరీక్షల విభాగంలో కానీ సంప్రదించాలి.

'ఆర్సీఆర్'లో గ్రాడ్యుయేషన్ డే



తిరుపతి(విద్య), ఆగస్టు 16: ఓ వ్యక్తి వ్యక్తిత్వమే విజయానికి సోపానంగా మారుతుందని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌బీ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కరకంబాడి మార్గంలోని ఆర్సీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలో ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, ఫేర్‌వెల్ డే ఘనంగా జరిగాయి. కళాశాల డైరెక్టర్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ.. ఎంబీఏ డిగ్రీతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యల పరిష్కారంలో నైపుణ్యం ఉన్నవారే బిజినెస్ మేనేజర్లుగా, సీఈవోలుగా రాణించగలరంటూ దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు మెరిట్ మెడల్స్ కోర్సు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ ఆర్ శివప్రసాద్ వర్మ, ఎంబీఏ హెచ్‌వోడీ నిరీష, ఎంసీఏ హెచ్‌వోడీ లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుపతి(విద్య), ఆగస్టు 16: వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969-70వ సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తిరుపతి వరదరాజ నగర్‌లో జరిగింది. 54 ఏళ్ల తర్వాత కలుసుకున్న 45 మంది తమ చిన్ననాటి కబుర్లతో సందడి చేశారు. అప్పటి తమ ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బరామయ్య, ఆయన కుటుంబ సభ్యులను, ఇతర గురువులు శివనాదాచారి, నాగయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, సుబ్బారావు, రాధాకృష్ణయ్యలను ఈ సందర్భంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నరసింహులు, కృష్ణయ్య, గోవర్ధన నాయుడు, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 16: మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. సెంట్రల్ తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యాయాదవ్, కట్టమంచి చంద్రబాబుయాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో స్వర్ణ భారత్ ట్రస్టు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సతీసమేతంగా వస్తున్నారు. విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వాగతం పలకనున్నారు.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా జడ్జి ఎ.నారాయణమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాల మేరకు 2014సెప్టెంబరు 26న చిన్నగొట్టిగల్లు మండలం బోడిరెడ్డిగారిపల్లె ఎస్టీకాలనీ వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మిట్టపల్లి ధనంజయరెడ్డి, తుపాకుల రామచంద్ర, తుపాకుల వెంకట్రామయ్యలను భాకరాపేట పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురికి జైలుశిక్ష ఖరారుచేశారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్ వాదించారు. కేసు నిరూపణకు కృషి చేసిన దర్యాప్తు అధికారి ఎస్.కంటయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

రూ. 86.33లక్షలకు టమోటా వ్యాపారి ఐపీ

తిరుపతి(లీగల్), ఆగస్టు 16: మంగళం క్వార్టర్స్‌లో నివాసం ఉండే టమోటా వ్యాపారి కె.హేమంత్‌కుమార్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.86.33లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. పిటిషనర్ తరపు న్యాయవాది జె.దేవరాజులు తెలిపిన వివరాల మేరకు.. టమోటా పంటను కె.హేమంత్‌కుమార్ కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసేవాడు. ఈ వ్యాపారంలో నష్టపోయారు. వ్యాపారం కోసం అప్పులు తెచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ఐపీ దాఖలు చేశారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

మంగళం, ఆగస్టు 16: భాకరాపేట రేంజ్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంట ఎస్టీ కాలనీ వద్ద కొంతమంది కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు చుట్టుముట్టి ఆరుగురిని పట్టుకోగలిగారు.ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు.సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు





అయ్యన్నపాత్రుడు - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

తిరుచానూరు, ఆగస్టు 16: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి గొడుగుల వితరణ



తిరుచానూరు, ఆగస్టు 16: వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని బెంగళూరుకు చెందిన గోపీనాథ్ కుటుంబం శుక్రవారం రెండు గొడుగులను తిరుచానూరు ఆలయానికి కానుకగా అందజేసింది. సూపరింటెండెంట్ శేషగిరికి భక్తుడు గోపీనాథ్ గొడుగులను అందజేశారు.

గోవిందుడి ఆలయంలో తులసి ఉత్సవం


గరుడవాహనంపై గోవిందరాజస్వామి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16: గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం తులసి మహత్యం ఉత్సవం జరిగింది. స్వామి వారికి ప్రియమైన తులసి, శ్రావణ ద్వాదసి నాడు ఆవిర్భవించిందని విశ్వాసం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వరూప దర్శనం తర్వాత 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు స్వామివారి గరుడసేవ ఆలయ మాడవీధుల్లో నిర్వహించారు. తొమ్మిది నుంచి 10 గంటల వరకు ఆలయంలోని బంగారు వాకిలి వద్ద స్వామివారి ఆస్థానం జరిగింది. అర్చకులు తులసి మహత్యం పఠించారు. ఆలయ అధికారులు మోహన్‌రావు, ధనంజయ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిగా అన్నపూర్ణ



తిరుపతి అర్బన్, ఆగస్టు 16: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, నివేదన సమర్పించి వివిధ రకాల పుష్పాలు, నగదు కాగితాలతో వరలక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కన్నులపండువగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



తిరుపతి అర్బన్, ఆగస్టు 16: కొత్తవీధిలోని కన్యకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, షోడచోపచార పూజ, సంకల్పం, వరలక్ష్మి అమ్మవారి ఆవాహన, ప్రత్యేక పూజల అనంతరం విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వరలక్ష్మిగా అలంకరించి వేదికపై ఆశీనులుచేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహిస్తుండగా దాదాపు 200మంది మహిళలు సామూహికంగా వ్రతమాచరించారు. చివర్లో గాజులు, పసుపుదారాలతోపాటు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ధర్మకర్తలు పాల్గొన్నారు.


వ్రతంలో పాల్గొన్న మహిళలు

గాజుల అలంకారంలో గంగమ్మ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం కావడంతో గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిగింది. అనంతరం అమ్మవారిని బంగారు ముఖకవచం, కిరీటంతో పాటు రంగు రంగుల వేలాది గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేనలో చేరిక



తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఆగస్టు 16: వైసీపీ నేత, స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు సునీల్ చక్రవర్తి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. అదేవిధంగా మరో వైసీపీ నేత వజీర్ బాషా కూడా పార్టీ కండువా కప్పుకున్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజా రెడ్డి ఉన్నారు.

వెస్ట్ సీఐగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

చిన్నబజారు వీధి, గాంధీరోడ్డు, టీకే స్ట్రీట్‌లలో ఆక్రమణల తొలగింపు


రామకృష్ణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16: తిరుపతి వెస్ట్ సీఐగా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన జయనాయక్‌ను వీఆర్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. రామకృష్ణ ఇప్పటి వరకు తిరుపతి క్రైం సీఐగా పనిచేశారు. ఈయనకు గతంలో ఇదే స్థానంలో సీఐగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాలతో గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే గాంధీ రోడ్డు, చిన్నబజారు వీధి, టీకే స్ట్రీట్‌లలో ఆక్రమణలను తొలగించారు. మళ్లీ ఆక్రమిస్తే కేసులు నమోదు చేసి.. జైలుకు పంపుతామని సీఐ హెచ్చరించారు. దీనిపై త్వరలో వర్తక, వాణిజ్య దారుల సంఘాలతోనూ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.


రోడ్డుపై ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 16: ప్రకాశం పార్కు, మాధవనగర్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయనున్నారు. ఈ కారణంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ కె.వాసుదేవ రెడ్డి తెలిపారు. శివజ్యోతినగర్, క్రాంతినగర్, ఎర్రమిట్ట, శ్రీనగర్‌కాలనీ, ఉపాధ్యాయనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కురుగొండ్ల



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 16: నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23 వార్డులో బొమ్మిడి కాలువ పక్కన ఉన్న పీర్లచావిడ వద్ద నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. రంజాన్ తోఫా వంటి పథకాలను ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తుందన్నారు. ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు తూ.చా. తప్పకుండా అమలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద నాయుడు, వెంకటగిరి మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బి. రాజేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగ అధ్యక్షుడు పి.విశ్వనాథనాయుడు, ఏ.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు నాయుడు, టి.చంద్రారెడ్డి, మస్తాన్, కరిముల్లా, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి కొప్పెర కానుక



కొప్పెర గంగాళంతో కొప్పెర వంశస్థులు

తిరుమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర గంగాళాన్ని కొప్పెర వంశస్థులు అందజేశారు. తిరుపతికి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర వంశస్థులు సాయిసురేష్ తన సోదరులు కుమార్, కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం కొప్పెర(హుండీ గంగాళం)తో ఆలయం చేరుకున్నారు. తనిఖీల అనంతరం ఆలయంలోకి తీసుకువెళ్లి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. సాయిసురేష్ మాట్లాడుతూ.. తాము 200 ఏళ్లుగా వంశపారపర్యంగా శ్రీవారికి కొప్పెర అందజేస్తున్నామని, రాగి, ఇత్తడి ఇతర లోహాలతో తయారు చేసిన ఈ గంగాళం బరువు 75 కేజీలు ఉంటుందని, తయారీకి దాదాపు రూ.2 లక్షలు అయ్యిందని తెలిపారు.

శ్రావణమాసం సందడి



శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో సందడి నెలకొంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాజులు, కలశం, టెంకాయలతో అలంకరించారు. కంఠావీధిలో నల్లగంగమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారి ఆలయాలను ఉదయం నుంచి రాత్రి వరకు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే చొరవతో టైలర్‌కు వైద్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో నివాసం ఉంటున్న టైలర్ బ్రహ్మయ్య ఆచారి గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు టైలర్ పోలూరు శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తిరుపతి స్విమ్స్‌లో మెరుగైన వైద్యం అందించేలా కృషి చేశారు. ప్రస్తుతం బ్రహ్మయ్య ఆచారి ఆరోగ్యం కుదుటపడుతోంది. శుక్రవారం దాతల ద్వారా సేకరించిన రూ.12,600 నగదును బ్రహ్మయ్య ఆచారికి టైలర్స్ సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమలో పోలూరు శ్రీనివాసులురెడ్డి, మౌలాలి, రాంబత్తెయ్య, చెంగయ్య, రమేష్, మణి, యతిరాజులు, సురేష్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తి నియోజవర్గంలోని పాడి రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. స్థానిక పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన పశువైద్యులతో సమావేశమయ్యారు. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఇందు కోసం స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పాడి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు రవీంద్రవర్మ, ఊహ, అరుణ్‌కుమార్, శరత్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోల్ అధికారికి స్వాగతం



రేణిగుంట, ఆగస్టు 16: రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి వివేక్ యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, తహసీల్దారు సురేష్‌బాబు స్వాగతం పలికారు.

సీఐ చొరవతో రోడ్డుకు మరమ్మతులు

సత్యవేడు, ఆగస్టు 16: సత్యవేడులో దుస్థితికి చేరిన రోడ్డుకు సీఐ మురళి చొరవతో మరమ్మతులు చేపట్టారు. సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో పలుచోట్ల రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మురళి రోడ్డు దుస్థితిపై స్పందించారు. గుంతలు తేలిన రోడ్లపై కంకరను తోలి చదును చేయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు కొంత ఉపశమనం కలిగింది. సీఐ ఆదేశాలతో కానిస్టేబుల్స్ హరి, ప్రతాప్ పనులను పర్యవేక్షించారు.

మురుగు సమస్యకు విముక్తి కల్పించండి

వరదయ్యపాళెం, ఆగస్టు 16: వరదయ్యపాళెం, బత్తలవల్లం పంచాయతీల్లో తుడా నిధులతో మురుగుకాలువల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తుడా వైస్ ఛైర్మన్ వెంకటనారాయణకు విన్నవించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు శుక్రవారం తుడా వైస్ ఛైర్మన్ మండలంలో పర్యటించారు. గోవర్ధనపురంలోని మారేడుకాలువ, బత్తవల్లంలో కలిపేటి కాలువను పరిశీలించారు. వరదయ్యపాళెం, బత్తవల్లంలో మురుగుకాలువలో లేకపోవంతో వర్షాలకు రహదారులపై నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే విన్నవించారు. స్పందించిన ఆయన నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో ప్రసాద్, నాయకులు నిర్మల్, పవన్, దశరథన్, కరుణాకర్ నాయుడు, శ్రీమన్నారాయణ, నందకిషోర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై నీలకంఠేశ్వరస్వామి రాజసం

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి శుక్రవారం సూర్యప్రభ వాహనంపై గ్రామంలో విహరించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు ఆలయంలో విశేష అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్ల గ్రామవీధుల్లో విహరించారు.

నేడు మెగా వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, కస్తూరి ఫౌండేషన్ అధినేత పరసా వెంకటరత్నం తెలిపారు. తన భార్య కస్తూరమ్మ 4వ వర్ధంతి సందర్భంగా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు గూడూరులో వైద్య శిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 16: పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 18న ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. చెన్నైకి చెందిన కేవీటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను అందిస్తామన్నారు.

పడిపోతున్న ధాన్యం ధరలు... ఆందోళనలో రైతులు!



విక్రయానికి సిద్ధం చేసి ఉన్న 1010 రకం ధాన్యం - లారీలోకి ధాన్యాన్ని లోడ్ చేస్తున్న కూలీలు

కోట, ఆగస్టు 16: ఎడగారు సీజన్‌లో నాటిన వరి పైర్లు ఇప్పుడిప్పుడే కోతలకు వస్తున్నాయి. అయితే రైతుల దగ్గర ధాన్యం పుష్కలంగా ఉండటంతో ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయి. దీంతో రైతులు ఆందో టళన చెందుతున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఎడగారు సీజన్‌లో ఫిల్టర్ పాయింట్లు, నేలబావుల కింద తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఇచ్చే 1010, ఏఎన్ఎం(సన్నాలు) రకాలను సాగు చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చాయి. మొదట్లో 1010 రకం ధాన్యం పుట్టి రూ.17వేల నుంచి రూ.18 వేలు పలకగా ప్ర స్తుతం రూ.16,500 పలుకుతోంది. ధాన్యం దళా రులు మొదట్లో 1010 రకం ధాన్యానికి మంచి. దరలు ఉన్నాయంటూ ప్రచారం చేశారు. ఇంతలో ప్రస్తుతం కర్ణాటకలోని తుమ్మకూరు తదితర ప్రాంతాల్లో ధాన్యం ధరలు పడిపోతున్నాయంటూ రోజురోజుకు ధరలను దిగజారుస్తున్నారు. అదే విధంగా 1638 కెఎన్ఎం (సన్నాలు) ఇటీవల వరకు పుట్టి రూ.22వేలు పలకగా ప్రస్తుతం ఇదే రకం రూ.20వేలు, రూ.20,200 మాత్రమే పలుకుతున్నాయి. ఈ రకం ధాన్యం ధరలు కూడా రోజురోజుకు పతనం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమిళనాడు, కర్ణాటకలో ధరలు పడిపోయాయంటూ ప్రచారం చేస్తూ రైతుల నుంచి దళారులు కారు చౌకగా ధాన్యం కొనుగోలుచేసి కొల్లగొడుతున్నారు. ఈ ఏడాది ఎడగారు రైతులకు ధరల పరంగా అగాధంలోకి కూరుకుపోయారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె నిర్వహణలోని స్వర్ణ భారత్ ట్రస్టు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సతీసమేతంగా వస్తున్నారు. ఉదయం 9.40 గంటలకు విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో వెంకటాచలం బయల్దేరి వెళతారు. అక్కడ స్వర్ణ భారత ట్రస్టు కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 3.35 గంటలకు తిరిగి తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడినుంచి విమానంలో తిరుగు ప్రయాణం కానున్నారు. దీనికోసం జిల్లా యంత్రాంగం విమానాశ్రయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టంది.ఉప రాష్ట్రపతికి విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వాగతం పలకనున్నారు. అలాగే వెంకటాచలం పర్యటనలో ఉపరాష్ట్రపతి వెంట పాల్గొనడంతోపాటు తిరుగు ప్రయాణంలో ఆయనకు వీడ్కోలు పలకనున్నారు. దీనికోసం మంత్రి ఆనం శుక్రవారం రాత్రికే తిరుపతి చేరుకుని పద్మావతి అతిథి గృహంలో బస చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా జడ్జి ఎ.నారాయణమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాల మేరకు 2014సెప్టెంబరు 26న చిన్నగొట్టిగల్లు మండలం బోడిరెడ్డిగారిపల్లె ఎస్టీకాలనీ వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మిట్టపల్లి ధనంజయరెడ్డి, తుపాకుల రామచంద్ర, తుపాకుల వెంకట్రామయ్యలను భాకరాపేట పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురికి జైలుశిక్ష ఖరారుచేశారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్ వాదించారు. కేసు నిరూపణకు కృషి చేసిన దర్యాప్తు అధికారి ఎస్.కంటయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

రూ. 86.33లక్షలకు టమోటా వ్యాపారి ఐపీ

తిరుపతి(లీగల్),ఆగస్టు16:మంగళం క్వార్టర్స్‌లో నివాసంఉండే టమోటా వ్యాపారి కె.హేమంత్‌కుమార్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.86.33లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. పిటిషనర్ తరఫు న్యాయవాది జె.దేవరాజులు తెలిపిన వివరాల మేరకు.. టమోటా పంటను కె.హేమంత్‌కుమార్ కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసేవాడు.ఈవ్యాపారంలో నష్టపోయారు.వ్యాపారం కోసం అప్పులు తెచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ఐపీ దాఖలు చేశారు.

నేడు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్

● ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్ణయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 16:చిత్తూరు జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలు నిలిచిపోనున్నాయి. కోల్‌కత్తాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) చిత్తూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి శుక్రవారం ప్రకటించారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 వరకు అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరగతిన నేర పరిశోధన పూర్తి చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. డ్యూటీలోని వైద్యులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేక రక్షణ చట్టాలను కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఏపీలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. తమ డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం





కలవకొండ, సూళ్లూరుపేట, చిన్నమాంబట్టుల్లో వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు-గాజుల అలంకరణలో నాయుడుపేట పోలేరమ్మ - బంగారు చీరలో కనుపూరు ముత్యాలమ్మ

చిల్లకూరు, ఆగస్టు 16: మండలంలో వరలక్ష్మీవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం బంగారు చీర అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో మహిళా భక్తులు వరలక్ష్మి వత్రాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరి పారు. ఈ ఆలయంలో కూడా వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు నోచుకున్నారు. **గూడూరు**: పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో, బజారు వీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సరస్వతిశిశు మందిర పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

సూళ్లూరుపేట: మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్వేంకటరామ్మూర్తి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మను గాజులతో అలంకరించారు. వేకువజామున నుంచే భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ, మహాలక్ష్మి, మానసాదేవి, దుర్గాదేవి ఆలయాల్లో కూడా వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు.

పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు!

టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు హెచ్చరిక ● కుప్పంలో గ్రానైట్ అక్రమ రవాణాపై సీరియస్

కుప్పం, ఆగస్టు 16: అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల్లో కదలిక లేదు. కానీ, కుప్పం నియోజకవర్గంనుంచి పొరుగు రాష్ట్రాలకు జరుగుతున్న గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న వరుస కథనాలకు సీఎం చంద్రబాబు స్పందించారు. పద్ధతి మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని స్థానిక అధికార పార్టీ నేతలను హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుప్పం మండలంలో వారం రోజుల్లో గ్రానైట్‌ను తరలిస్తూ మూడు వాహనాలు పట్టుబడ్డాయి. నడిమూరు చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన వాహనాన్ని పర్మిట్ ఉందని చెప్పి అధికారులు వదిలేశారు. గుడ్లనాయనిపల్లె క్వారీ వద్ద రెండు వాహనాలలో గ్రానైట్ లోడ్ చేస్తుంటే గ్రామస్థులు అడ్డగించి పోలీసులకు అప్పగించారు. ఇందులో ఒక దానిని పోలీసులు సీజ్ చేసి, ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. రెండోది గ్రానైట్ రవాణాకు సంబంధం లేదని విడిచిపెట్టేశారు. వీటిపై ఆంధ్రజ్యోతిలో నాలుగు రోజులుగా వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయి. ఇలాగే గ్రానైట్ అక్రమంగా తరలుతూ పోతే ప్రభుత్వానికి, అధికార పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందని, నియంత్రించాల్సిన అవసరం జిల్లా అధికారులకు ఉందని కథనాలు హెచ్చరించాయి. వీటిపై తహసీల్దారు చిట్టిబాబు మాత్రం స్పందించి కృష్ణదాసనపల్లె క్వారీదాకా సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేసి వచ్చారు. కానీ అటు మైనింగ్, ఇటు పోలీసు శాఖనుంచి కానీ కనీస స్పందన లేదు. చివరకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. నియోజకవర్గంలోని కొందరు నేతలతో టెలిఫోన్‌లో మాట్లాడారు. గ్రానైట్ రవాణాపై ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలను ఆయన ప్రస్తావించారు. 'ప్రతిపక్షంలో ఉన్నపుడు మనమే గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి అక్రమ క్వారీలను ఆపించాం. ఇప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతున్నదంటూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. మీలో ఎవరికైనా ఇందులో ప్రమేయముంటే వెంటనే మానుకోండి' అని చాలా స్పష్టంగా చెప్పారు. గ్రానైట్ అక్రమ రవాణా ఇలాగే జరుగుతుంటే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తుందని, తనమీద ప్రజల్లో చెడు అభిప్రాయం కలిగేలా చేస్తుందన్నారు. కుప్పం తన నియోజకవర్గమని, అక్కడ ఎటువంటి తప్పు జరిగినా తనదే బాధ్యత అవుతుందని చెప్పారు. రాష్ట్రం మొత్తానికి కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని తాను తపన పడుతుంటే, నాయకులు ఇలా అక్రమ వ్యవహారాల్లో తలదూర్చి చెడ్డ పేరు తేవడం దారుణమని మండిపడ్డారు. 'నేను చెప్పాల్సింది చెప్పాను. కాదు, మేము గ్రానైట్ అక్రమ రవాణాలో వేలుపెడతామంటే, ఇక మీఇష్టం. ఎవరైనా సరే, చట్టం తనపనితాను చేసుకుని పోతుంది. మళ్లీ నా దగ్గరకు రావద్దు. వచ్చినా నా అపాయింట్‌మెంట్ మీకు లభించదు' అని చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అదే సమయంలో గ్రానైట్ అక్రమ రవాణా విషయంలో పట్టనట్లున్న అధికార యంత్రాంగానికి కూడా సీఎంవో కార్యాలయంనుంచి హెచ్చరికలు జారీ అయినట్లు తెలిసింది. ఈ విషయంలో ఎవరైనా ఉపేక్షించవద్దని, అలా చేస్తే అధికారులపైన కూడా చర్యలకు ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

గిరిజనులపై ఇటుక బట్టీ యజమాని వేధింపులు

● అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని దాడి

● యువకుడి నిర్బంధం

● విడిపించిన పోలీసులు



పోలీస్ స్టేషన్ వద్ద గిరిజనులు

పెళ్లకూరు, ఆగస్టు 16: ఇటుక బట్టీల యజమాని అడ్వాన్స్ చెల్లించి పనులు కల్పించకుండా వేధింపులకు పాల్పడ్డాడు. విసిగిపోయిన కూలీలు తిరిగి ఇళ్లకు చేరారు. దీంతో తాను ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని వారిపై దాడికి పాల్పడ్డాడు. వారి కుటుంబాల్లోని యువకుడిని నిర్బంధించాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిర్బంధంలో ఉన్న ఆ యువకుడిని విడిపించారు.

పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు రాజుపాళెంకు చెందిన ఓ వ్యక్తి ఇటుక బట్టీల వద్ద పనులకు కానూరు రాజుపాలెం గిరిజన కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలకు చెందిన 10 మందిని మాట్లాడుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.30వేలు చెల్లించాడు. దీంతో నాలుగు కుటుంబాలు ఇటుక బట్టీల వద్దకు చేరుకున్నారు. అయితే అప్పటి నుంచి వారికి సక్రమంగా పనులు కల్పించక పోగా భోజన వసతి కూడ ఏర్పాటు చేయలేదు. దీంతో విసిగి వేసారి తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇటుక బట్టీల యజమాని గురువారం రాత్రి గిరిజనులపై దాడికి పాల్పడ్డాడు. శ్రీనివాసులు(20)ను తన ఇంటి వద్ద నిర్బంధించాడు. బాధిత గిరిజనులు పెళ్లకూరు పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అదేరోజు రాత్రి యువకుడిని విడిపించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. కాగా శుక్రవారం ఉదయం ఆ వ్యక్తి మరోసారి గిరిజన కాలనీకి చేరుకుని అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. గిరిజనులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బట్టీ యజమానిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ... బాధితుల ఫిర్యాదు మేరకు వాస్తవాలు తెలుసుకుని చట్టపరమైన చర్యల తీసుకుంటామని తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 16: సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లలాంటివని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పాత బీఎంఆర్ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల భూమిపూజలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.దీపికతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌లో పథకాలను అమలు పరుస్తున్నారని తెలిపారు.మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ సీఐకి తప్పిన ప్రమాదం



డివైడర్‌పై నిలిచి ఉన్న కారు

దొరవారిసత్రం, ఆగస్టు 16: నాయుడుపేట టౌన్ సీఐ బాబికి శుక్రవారం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. దొరవారిసత్రం మండలం వేణుంబాక క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆయన ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. శ్రీహరికోట నుంచి నాయుడుపేటకు వెళ్తుండగా కారు కుడివైపు చక్రం కనెక్టివ్ రాడ్ విరిగి పోవడంతో వాహనం అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించ డంతో ప్రమాదం తప్పింది. దీంతో వాహనం బోల్తా పడకుండా ఆగింది.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిల్లకూరు, ఆగస్టు 16: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం సెబ్ అధికారులు నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కోట క్రాస్‌రోడ్డు సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నాయుడుపేట నుంచి గూడూరు వైపునకు ఏలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

శ్రీకాళహస్తి రచయితకు శివేగారి దేవమ్మ పురస్కారం



శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తికి చెందిన జర్నలిస్టు, రచయిత కె.ఎ.మునిసురేష్‌పిళ్లైకి శివేగారి దేవమ్మ పురస్కారం లభించింది. 'గారడీవాడు' కథా సంపుటికిగాను ఈ పురస్కారం వచ్చింది. పలమనేరుకు చెందిన శివేగారి దేవమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023వ సంవత్సరానికి గాను ఎంపిక చేసిన ఉత్తమ గ్రంథాలకు శనివారం తిరుపతి బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. పూర్ణమూ నిరంతరమూ.. రాతి తయారీ.. గారడీవాడు కథా సంపుటిలను మునిసురేష్‌పిళ్లై వెలువరించారు. 42 కవితలతో 'షష్ఠముడు' అనే కవితా సంపుటి వెలువడింది. అలాగే, సుపుత్రికా ప్రాప్తిరస్తు, పుత్రికాశత్రుః నవలలను రచించారు. పుత్రికా శత్రుః నవలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు, మునివాక్యం సంపాదకీయ కథనాల సంపుటికి మనోవికాస/విజ్ఞాన సాహితీ పురస్కారం, రాతి తయారీ కథకు తానా కథల పోటీల్లో ప్రథమ బహుమతి, గారడీవాడు కథకు నాటా వారి పోటీలలో ప్రథమ బహుమతి, షష్ఠముడు కవితకు తెల్సా కవితల పోటీలలో ప్రథమ బహుమతి.. ఇలా ఎన్నో బహుమతులు, పురస్కారాలు పొందారు.

ఎన్నికల అక్రమాలపై విచారణ జరిపించండి



ఎన్నికల అధికారితో ఎమ్మెల్యే పులివర్తి నాని

రేణిగుంట, ఆగస్టు 16: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చంద్రగిరి నియోజక వర్గంలో దొంగ ఓట్లు, బూత్‌ల పెంపు, మార్పుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. శుక్రవారం ఆయనను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి వినతపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో దొంగ ఓట్లను అరికట్టేందుకు తన సతీమణి పులివర్తి సుధారెడ్డి ఎన్నికల అధికారికి ఆధారాలు అందజేశారని తెలిపారు. 2019కి ముందు దొంగ ఓట్లు నమోదు చేశారని, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని, 2024లోనూ దొంగ ఓట్ల నమోదులో అక్రమాలు జరిగాయని, వీటన్నింటిపై ఆధారాలను ఎన్నికల అధికారులకు సమర్పించామన్నారు. ఇందులో ఎంతోమంది అధికారులు భాగస్వాములు అయ్యారని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన స్వర్ణోత్సవాలు



రేణిగుంట, ఆగస్టు 16: రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్స వాలు శుక్రవారం ముగిశాయి. దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెండు రోజుల పాటు రైతులకు చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం డ్రోన్ ద్వారా పిచికారీపై రైతులకు అవగాహన నిర్వహించారు. వ్యవసాయంలో సాగు ఖర్చు తగ్గించడంలో యాంత్రీకరణ ప్రాముఖ్యం, సేంద్రియ వ్యవసాయం మొదలగు అంశాల గురించి రెండు రోజుల పాటు నిపుణులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఛైర్మన్ డాక్టర్ వెంకటరత్నం, పరిశోధనా సంచాలకు రాలు సుమతి, రాజశేఖర నాయుడు, సభ్యులు శ్రీనివాసులు, శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తిని పూజాద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రావణమాసం కావడంతో మహిళలు దీపాలు వెలిగించారు.కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. రాహుకాల అభిషేకాలు చేశారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు.

ఐదు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యంతో పట్టుబడ్డ లారీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: వాహనంతో సహా ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... పట్టణ శివారులోని కొత్తబైపాస్ రోడ్డులో అక్రమంగా రేషన్‌బియ్యం తరలుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం పోలీసులు నిఘా వేశారు. తొట్టంబేడు మండలంలో రేషన్ బియ్యం సేకరించుకుని తడ ప్రాంతానికి తరలిస్తున్న లారీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ పరారవగా అతని సహాయకుడు లోకేష్ పట్టుబడ్డాడు. అతడు దొరవారిసత్రానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. లోకేష్‌గా గుర్తించి వాహనంతో సహా రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు అనుభవిస్తున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద, మధ్య తరగతి రైతు కుటుంబాలను తమ అధికార బలంతో బెదిరించి సొంతం చేసుకున్న వైసీపీ నేతల అక్రమాలను బయటపెట్టడానికి లోతైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో వేలాది ఎకరాలు దోచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు మిన్నల రవి, ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, శివ, సయ్యద్ చాంద్‌బాషా, సులేమాన్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మరాజస్వామికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకెళుతున్న గిరినాయుడు దంపతులు

ఏర్పేడు, ఆగస్టు 16: పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లకు గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరిబాబునాయుడు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ వేద పండితులు గిరినాయుడు దంపతులకు స్వాగతం పలికి పట్టువస్త్రాలను అందుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం సభ్యులు అర్జునబాబు, లలిత కరుణాకర్, మాధవ్య, కృష్ణప్ప మొదలియార్, మురగప్ప మొదలియార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు


తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

పిచ్చాటూరు, ఆగస్టు 16: మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలో వారంరోజులుగా జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి తిరుణాళ్లలో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సుమాను అధిరోహించడాన్ని భక్తులు తిలకించారు. అర్జున వేషధారి మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ ఆయన జోలి నుంచి విసిరిన పండ్లు, ఫలహారాలు, పూలు, నిమ్మపండ్లు అందుకోవడానికి భక్తులు పోటీపడ్డారు.

ఏర్పేడు: పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి శివనామ స్మరణలతో తపస్సుమాను ఎక్కి భక్తులపై నిమ్మకాయలు విసిరాడు. సంతానం లేని మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు పోటీ పడి నిమ్మకాయలు అందుకున్నారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను చుట్టూ వరపడ్డారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గాజులమండ్యం ఎస్ఐ బదిలీ

రేణిగుంట, ఆగస్టు 16: గాజులమండ్యం ఎస్ఐగా సునీల్ బదిలీ అయ్యారు. తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ గాజులమండ్యం ఎస్ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా ఇక్కడ పనిచేస్తున్న సునీల్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

అశ్వ వాహనంపై వీరభద్రుడు

నారాయణవనం, ఆగస్టు 16: మండల కేంద్రంలోని నెలకొన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ స్థానిక ఆలయ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

వేడుకగా ఊంజలసేవ

నారాయణవనం, ఆగస్టు 16: మండలంలో నెలకొన్న పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. 7 గంటలకు కల్యాణ వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ఆలయ అంతఃప్రాకారంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. అలాగే స్థానిక వీరరాఘవ దేవస్థానంలో ఉదయం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతమాచరించారు. అమ్మవారికి కుంకుమార్చన చేసి వాయనాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఆలయ సముదాయంలోని అవనాక్షమ్మ ఆలయంలో మహిళలు పిండి దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు.

చేతిపంపు ప్రారంభం

ఏర్పేడు, ఆగస్టు 16: పాపానాయుడుపేటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపును శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, మోహన్ నాయుడు, నాగరాజు నాయుడు, చిరంజీవులు నాయుడు, కృష్ణప్ప మొదలియార్, డిల్లీబాబు, గిరినాయుడు, నిరంజన్ బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

కేవీబీపురం, ఆగస్టు 16: కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా బదిలీ అయిన గోపిని శుక్రవారం మండలంలోని మహదేవపురం గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో ధనంజయులు, రాములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

రేణిగుంట, ఆగస్టు 16: మండల పరిధిలోని అన్నస్వామి పల్లె లింకురోడ్డు నుంచి తిమ్మయ్యగుంట గ్రామానికి రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. సుమారు కిలోమీటరు దూరం ఉన్న ఈరోడ్డు గోతులమయంగా మారింది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు పనులు చేపట్టారు.

సుజాతకు యోగా రత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న సుజాత

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: తమిళనాడు ఇండియన్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా 18వ యోగా చాంపియన్‌షిప్ పోటీలు తమిళనాడులోని గుమ్మిడిపూడిలో కైరాయి యోగా విద్యాపీఠంలో గురువారం జరిగాయి. ఇందులో శ్రీకాళహస్తికి చెందిన యోగా మాస్టర్ ఆయలాం సుజాతకు యోగా రత్న అవార్డును ప్రదానం చేశారు.

విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు

కేవీబీపురం, ఆగస్టు 16: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు గురువారం తిరుపతి పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ కనబరిచారు. వారికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.


వరలక్ష్మీదేవి పూజలు చేస్తున్న వేదపండితులు - వ్రతం ఆచరిస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీవ్రతం

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నాలుగవ గేటు నుంచి బ్రహ్మగుడి వరకు మొక్కలు, పచ్చతోరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువపందిళ్ల కింద సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి వ్రతం ఆచరించారు. లక్ష్మీదేవి ఉత్సవమూర్తిని వేదికపై కొలువుతీర్చారు. ఆలయ అర్చకులు, వేదపండితులు కలశస్థాపన పూజలు చేసి లక్ష్మీపూజ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. మహిళల చేత కుంకుమ పూజలు చేయించారు. మహిళలకు వాయినాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్వీ ఎస్ఎన్ మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్


శ్రీసిటీలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

సత్యవేడు, ఆగస్టు 16: శ్రీసిటీలో పలు పరిశ్రమలకు భూమిపూజ, ప్రారంభోత్సవాలకు ఈనెల 19న విచ్చేస్తున్న సీఎం చంద్రబాబు పర్యటనకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఎస్పీ సుబ్బారాయుడు, జేసీ శుభం భన్సల్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం ఉదయం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 8 పరిశ్రమలకు భూమిపూజ, 16 పరిశ్రమల ప్రారంభోత్సవం చేయడంతో పాటు ఐదు పరిశ్రమలకు ఎంవోయూలు కుదుర్చుకోనున్నారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్‌కు శ్రీసిటీ ప్రతినిధులు వివరించారు. శ్రీసిటీ సమీపం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సీఎం రోడ్డు మార్గాన శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌కు చేరుకుని భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. అనంతరం ఫాక్స్‌కాన్ పరిశ్రమ ప్రతినిధులతో, పలువురు పరిశ్రమల సీఈవోలతో సీఎం సమావేశవుతారని వివరించారు. కాన్ఫరెన్స్ హాల్, భూమిపూజ, పరిశ్రమలను ప్రారంభించనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ భద్రతాపరమైన అంశాలలో ఎలాంటి రాజీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు, ఆర్డీవో కిరణ్‌కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, శ్రీసిటీ ప్రతినిధులు ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు వసూళ్లను అడ్డుకోండి


ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులతో చర్చిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

పిచ్చాటూరు, ఆగస్టు 16: మండలంలోని అడవికొడియంబేడు ఇసుక డంపు వద్ద అక్రమ వసూళ్లను ఆపాలని ప్రజలు డిమాండ్ చేశారు. అడవికొడియంబేడు డంపు నుంచి గత నెల రోజులుగా వినియోగదారులు ఇసుకను తీసుకెళుతున్నారు. అయితే ట్రాక్టర్ల డ్రైవర్లకు, అధికారులకు మధ్య జరిగిన వాగ్వాదం కారణంగా రెండు రోజులుగా ఇసుక లోడింగ్ ఆపేశారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో సమావేశమై చర్చించారు. సమయమనం పాటిస్తే వంతులవారీగా టోకెన్లు అందుతాయని సర్దిచెప్పారు. అయితే ఈ సందర్భంగా కొందరు వినియోగదారులు అక్కడ జరుగుతున్న అవినీతి తంతుపై అధికారులకు వివరించారు. కేవలం ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ డబ్బులు తీసుకుని టిప్పర్లు అనుమతిస్తున్నారని ఇసుక డంపు అధికారులపై ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రి టోకెన్లు వేసుకుని ట్రాక్టర్‌కి రూ.500, టిప్పర్‌కు రూ.2000 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు నిఘా ఉంచి స్థానికులకే ఇసుక దక్కేట్లు చూడాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాళెం, ఆగస్టు 16: వరదయ్యపాళెం మండలం పాండూరు పంచాయతీ వీఆర్ కండ్రిగ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివప్రసాద్ తెలిపారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


అయ్యన్న పాత్రుడితో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 16: తిరుమల శ్రీవారి దర్శనార్థం అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కుటుంబ సమేతంగా విచ్చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

అరణియార్ పర్యాటక పనుల పరిశీలన


అరణియార్ వద్ద పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, తుడా వీసీ వెంకటనారాయణ

పిచ్చాటూరు, ఆగస్టు 16: అరణియార్ రిజర్వాయర్‌లో తుడా నిధులతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, తుడా వీసీ వెంకటనారాయణతో కలసి పనులను శుక్రవారం పరిశీలించారు. వ్యూ టవర్, బోటింగ్ జెట్టి, చిల్డ్రన్ పార్కు పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు మదన్‌గోపాల్, రమేష్‌బాబు, ఎంపీడీవో రాధారాణి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తుడా నిధులతో పార్కు విస్తరణ

సత్యవేడు, ఆగస్టు 16: తుడా నిధులతో సత్యవేడు పార్కును విస్తరించి ప్రజలకు అందుబాటులో తెస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శుక్రవారం తుడ వైస్ చైర్మన్ వెంకటనారాయణతో కలిసి పార్కును పరిశీలించారు. పార్కుకు ఇరువైపులా ఉన్న సంత స్థలాన్ని పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి సంబంధిత రికార్డులను అందించాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ రవిచంద్రబాబు, సెక్రటరీ మునిరవికుమార్, సర్వేయర్ గిరి, ఎంపీటీసీ బీటీఎస్ రెడ్డి, నాయకులు చిన్న, బాల మురళి, రాధయ్య, కొండూరు బాలరాజు, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హేమభూషణం, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శాస్త్రోక్తంగా వరలక్ష్మీవ్రతం


వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

వడమాలపేట, ఆగస్టు 16: వడమాలపేటలో మహిళలు శాస్త్రోక్తంగా వ్రతాన్ని నిర్వహించారు. ఉదయం మంగళ స్నామాచరించి పసుపుతో అమ్మవారిని, కలశాన్ని ప్రతిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది నూలు పోగులతో పసుపు ధారాన్ని తొమ్మిది రకాల పుష్పాలతో లక్ష్మీదేవి వ్రతాన్ని ఆచరించి చేతికి కంకణంలా తొడుక్కున్నారు. లక్ష్మీదేవికి నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

గౌతు లచ్చన్న జయంతి

పుత్తూరు టౌన్, ఆగస్టు 16: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద గౌతు లచ్చన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ్ కుల హక్కుల పరిరక్షణ సమితి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరత్నం, నాయకులు లింగస్వామి, దొరస్వామి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన

పుత్తూరు టౌన్, ఆగస్టు 16: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన ఉన్మాదిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పుత్తూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ కార్యదర్శి ఉమేష్‌చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.


నంది వాహనంపై పార్వతీ పరమేశ్వర్లు - అర్జున తపస్మాన్

వైభవంగా అర్జున తపస్మాన్

పుత్తూరు టౌన్, ఆగస్టు 16: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జునుడు తపస్మాన్ అధిరోహణ ఘట్టం వైభవంగా జరిగింది. స్థానిక శివాలయం నుంచి పార్వతీ పరమేశ్వరులు వివిధ పుష్పాలంకరణతో నంది వాహనంపై ఊరేగుతూ భక్తులు హారుతులందుకుంటూ, అర్జునునికి పాశుపతాస్త్రం అందించారు. అనంతరం అర్జునుడు తపస్మాన్ అధిరోహించి భక్తులకు పుష్పాలను, ఫలాలను అందించారు. కార్యక్రమం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షత్రియ సంఘ నాయకులు నారాయణ బాబు, శ్రీధర్ వర్మ, మురళి, పీసీ కృష్ణంరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ సాళ్వాకం కృష్ణప్ప మెదలి, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్ పాల్గొన్నారు.

బాస్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాల సమర్పణ

బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో అలుగు ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం బలిజ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి చీర, సారే ఊరేగింపుగా తీసుకొచ్చారు. రాత్రి మంచినీళ్ల గుంట వద్ద పచ్చి కుండపై కత్తిని నిలిపి, అలుగు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తహసీల్దారుకు సన్మానం



పుత్తూరు టౌన్, ఆగస్టు 16: పుత్తూరు తహసీల్దారు వెంకటేశ్వర్లును శుక్రవారం తాలూకా అధ్యక్షుడు ఎల్‌సీ రవికుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నాయకులు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీజీఐఏ పుత్తూరు తాలుకా యూనిట్ కార్యదర్శి మోహన్‌బాబు, కోశాధికారి సుగుణ, ఉపాధ్యాక్షులు పెంచలయ్య, తిరుమలయ్య, ప్రచార కార్యదర్శి శ్రీమరిరాజు, రవిచంద్ర, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.